## క్లుప్తంగా

### విజయానంద స్వామీజీ జన్మదిన వేడుకలు



పూజలు చేస్తున్న ట్రస్ట్ సభ్యులు, భక్తులు

కర్నూలు కల్చరల్: కర్నూలు సూర్య నారాయణ స్వామి ఆలయంలో మంగళవారం మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో గురుపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సూర్య మకర సంక్రమణం సందర్భంగా నవగ్రహ లక్ష్మీగణపతి, మూల మంత్ర సహిత అరుణ హోమం, ఆయుష్య హోమం తదితర పూజలను విశేషంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు, మాతృ మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మీసాల సుమలత

కర్నూలు(సెంట్రల్): కర్నూలు శివారులోని జొహరాపురంలో దళితుల భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నగర కన్వీనర్ మీసాల సుమలత డిమాండ్ చేశారు. బుధవారం 48వ వార్డు రోజా వీధిలోని కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూములను కబ్జా చేస్తే జైలుకు పంపుతామని సీఎం చంద్రబాబునాయుడు చెబుతున్నా ఆచరణలో కనిపించడం లేదన్నారు. జిల్లాలో రోజురోజుకు దళితుల భూములపై అగ్రవర్ణ కులస్తులు కన్నెసి కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. జొహరాపురంలో దళితుల భూములకు రక్షణ కల్పించాలని లేకపోతే కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసమ్మ, శేషమ్మ, పార్వతమ్మ, నాగన్న, మియ్యాబాషా, నాగప్ప పాల్గొన్నారు.

### తప్పిన పెను ముప్పు



బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఊడిపడిన పెచ్చులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎవరూ లేని సమయంలో పెచ్చులు ఊడి పడ్డాయి. అయితే న్యాయవాదులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం కార్యాలయంలో చోటు చేసుకున్న ఈఘటనతో న్యాయవాదులు ఉలిక్కిపడ్డారు. గతంలో కూడా పెచ్చులు ఊడిపడేవి. అయితే తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. ఈ క్రమంలో మళ్లీ పెచ్చులు ఊడి పడడంతో శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి అధికారులను కోరారు.


### నేడు పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: మహా ప్రస్థానం.. మరో ప్రస్థానం సంస్థ ఆధ్వర్యంలో చౌశా రాసిన గాజా కవిత్వం 'బిసాన్ ఓవ్ డా' పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం ఉదయం 10.30 గంటలకు ఓల్డ్ బస్టాండ్‌లోని హోటల్ బావర్చి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త కెంగార మోహన్ తెలిపారు. ప్రముఖ అర్థ శాస్త్ర నిపుణులు డాక్టర్ మన్సూర్ రహమాన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, కథా రచయిత ఇనాయతుల్లా పుస్తక సమీక్ష చేస్తారని పేర్కొన్నారు.

**జర్నలిజం ధృవతార 'ఎంసీ' పుస్తకావిష్కరణ**

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గురువారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సాయంత్రం 5 గంటలకు సీనియర్ జర్నలిస్టు ఆకుల అమరయ్య రచించిన 'జర్నలిజం ధృవతార ఎంసీ' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్ తెలిపారు. కురాడి చంద్రశేఖర కల్కూర పుస్తకావిష్కరణ చేస్తారని పేర్కొన్నారు.

### సాక్షి సినిమాలు




**ఎస్వీసీ కాంప్లెక్స్:** సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహారాజ్, గేమ్ ఛేంజర్
**వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ :** సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహారాజ్, గేమ్ ఛేంజర్
**వెంకటేష్ సినీ కాంప్లెక్స్:** సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహారాజ్, గేమ్ ఛేంజర్
**శ్రీరామ :** సంక్రాంతికి వస్తున్నాం
**రాజ్ :** సంక్రాంతికి వస్తున్నాం
**భరత్ కాంప్లెక్స్ :** డాకు మహారాజ్, పుష్ప–2
**విజయ థియేటర్ :** డాకు మహారాజ్
**విక్టరీ టాకీస్ :** మార్కో

# ఊరూవాడ సంక్రాంతి శోభ

- అంబరాన్నంటిన సంబరాలు
- ఇళ్ల ముంగిళ్లలో రంగవల్లుల తళుకులు
- సంక్రాంతి లక్ష్మికి ఘన స్వాగతం



గోదాగోకులంలో ప్రత్యేక పూజల్లో త్రిదండి రామానుజ జీయర్ స్వామి తదితరులు



సూర్య భగవానుడికి హారతి ఇస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: జిల్లాలో సంక్రాంతి పండుగను మూడు రోజుల పాటు ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. తొలి రోజు సోమవారం భోగభాగ్యాలనిచ్చే భోగి, రెండో రోజు సరదాల సంక్రాంతి, మూడో రోజు కమ్మనైన వంటలతో కనుమ పండుగను జరుపుకున్నారు. జిల్లా అంతటా ఏ ఇంట చూసినా రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు నూతన శోభ సంతరించుకుంది. సంస్కృతి సంప్రదాయలతో పాటు సందేశాత్మక ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంప్రదాయ దుస్తులతో బంధుమిత్రులతో సంతోషంగా గడిపారు. ఇళ్లతో పాటు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటి ముంగిళ్లల్లో యువతులు, మహిళలు ఇంద్ర ధనుస్సులాంటి రంగవల్లులను తీర్చిదిద్దారు. ముగ్గుల్లో బంతి పూల గొబ్బెమ్మలను పెట్టి భక్తిశ్రద్ధలతో సంక్రాంతి లక్ష్మికి ఘనంగా స్వాగతం పలికారు. గోపూజ చేశారు. చిన్నారులను రేగి పండ్లతో ఆశీర్వదించారు. హరిదాసులు కీర్తనలు ఆలపిస్తూ వీధుల్లో సందడి చేశారు. గంగిరెద్దుల విన్యాసాలు ప్రత్యేకంగా నిలిచాయి. చిన్నా పెద్ద తేగా లేకుండా గాలిపటాలను ఎగుర వేస్తూ కేరింతలు కొట్టారు. వ్యవసాయంలో తమకు చేదోడుగా ఉండే పశువులకు పూజలు చేశారు. వాటికి కృతజ్ఞతా పూర్వకంగా శుభ్రంగా కడిగి పొంగలి నైవేద్యం పెట్టి పూజలు చేశారు. బసవన్నలను వీధుల్లో ఊరేగించారు.

■ తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని గోదాగోకులంలో అత్యంత భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. గోజాతి సంరక్షణ మహోన్నతమైనదని గో సంతతి వృద్ధితోనే లోకం సుభిక్షంగా ఉంటుందని త్రిదండి శ్రీమన్నారాయణ అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పిలుపునిచ్చారు. త్రిదండి బృందావన రామానుజ జీయర్ స్వామి, త్రిదండి శఠగోపముని రామనుజ జీయర్‌స్వామి గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, అర్చకులు రమేష్ బట్టర్ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

■ గోసంరక్షణ శాలలో సంక్రాంతి వేడుకలు వైభవంగా జరిగాయి. గంగిరెద్దుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గోశాల ఉద్యోగులు గంగిరెద్దులకు చీర, సారె సమర్పించారు.

■ కర్నూలు సూర్య నారాయణ స్వామి ఆలయంలో మకర సంక్రమణ పర్వదినాన్ని పురస్కరించుకొని మకర రాశిలోకి ప్రవేశించే సూర్య భగవాన్ మూల విరాట్‌కు విశేష ద్రవ్యాలు, క్షీరంతో పురుష సూక్త విధానంలో అరుణ, రుద్ర మంత్ర పారాయణంతో అభిషేకం నిర్వహించారు. అరుణ హోమం జరిగింది. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చన, నక్షత హారతి, మంత్ర పుష్పంతో భక్తులకు దర్శనం కల్పించారు.

**ఇందిరాగాంధీ నగర్‌లో..**

కర్నూలు(సెంట్రల్): స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లో 43 ఏళ్లుగా కులమతాలకు అతీతంగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తుండటం గర్వకారణమని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల పేర్కొన్నారు. మంగళవారం సంక్రాంతి పండుగ పురస్కరించుకొని డీవైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ముగ్గులు, ఆటలు, పాటలు, క్రీడా పోటీలు నిర్వహించారు. వందలాది మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొనగా, యువతీ, యువకులు ఆటలు, పాటలు, క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వృద్ధులు, మహిళలు మ్యూజికల్ చైర్స్ పోటీల్లో పాల్గొన్నారు. ఆయా పోటీల్లో విజేతలకు సాయంత్రం సభను ఏర్పాటు చేసి అతిథుల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో టి.రాముడు, నగేష్, పీఎస్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**మతోన్మాదంపై పోరాటం**

నగరంలోని 32వ వార్డు ముజఫర్ నగర్‌లోనూ సీపీఎం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ, సాయిబాబా, ప్రభాకర్, సుధాకరప్ప, నగేష్ బహుమతులను అందజేశారు. వారు మాట్లాడుతూ.. కులాలు, మతాలకు అతీతంగా ముగ్గుల పోటీలను నిర్వహించడం గర్వకారణమన్నారు. మతోన్మాదంపై మహిళలు దండెత్తాలని పిలుపునిచ్చారు.



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఏపీ శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల



ఇందిరాగాంధీ నగర్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న సాయిబాబా

## వేడుకగా సంక్రాంతి సంబరాలు

కర్నూలు కల్చరల్: కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో సంక్రాంతి సంబరాలు వేడుకగా సాగాయి. డీవీఆర్ బ్రాండ్ బ్యాండ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో యాంకర్లు రష్మి, దీప్తి నల్లమోతు, సినీ గాయకులు హనుమాన్, సాయి శిల్ప, జబర్దస్త్ కమెడియన్లు సందడి చేశారు. ఈ నెల 13వ తేదీన నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు మంత్రి టీజీ భరత్, యాంకర్ రష్మి, డీవీఆర్ బ్రాండ్ సంస్థ నిర్వాహకులు డి.వెంకటేశ్వరెడ్డి బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి చింతా సరోజకు రెండున్నర సెంట్ల ఓపెన్ ప్లాట్, ద్వితీయ బహుమతి ఆలూరు ద్రాక్షావనికి ఎలక్ట్రికల్ స్కూటీ, తృతీయ బహుమతి ఆర్.గౌతమికి సోఫాసెట్‌తో పాటు నాల్గవ, ఐదవ స్థానాల్లో నిలిచిన వారికి ఒక్కొక్కరికి పావుకేజీ వెండితో పాటు 10 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ.. నగర ప్రజలకు అన్ని విధాల అండగా నిలుస్తానన్నారు. రాబోయే ఐదేళ్లలో కర్నూలు రూపురేఖలు మారుస్తానన్నారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి జరుగుతోందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సిటీ కేబుల్ ఎండీ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

**సందడే సందడి**

సంబరాల్లో యాంకర్ రష్మి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడుతూ.. కర్నూలు ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. సింగర్స్ హనుమాన్, సాయి శిల్ప పాడిన పాటలు ప్రేక్షకులను హుషారెత్తించాయి. కమెడియన్లు కార్తీక్, రాము, శాంతిస్వరూప్, నూకరాజు, వినోద్, ప్రవీణ్‌ల స్కిట్స్ అలరించాయి.



ముగ్గుల పోటీ విజేత చింతా సరోజ భర్తకు ఇంటి ప్లాట్ పత్రాలను అందజేస్తున్న మంత్రి భరత్, నిర్వాహకులు వెంకటేశ్వరరెడ్డి, తదితరులు

## పండుగలు సంస్కృతికి నిలయాలు



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: పండగలు సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కల్లూరు అర్బన్ 32, 35వ వార్డులలో నిర్వహించిన ముగ్గుల పోటీ కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రంగురంగుల ముగ్గులను చూస్తుంటే గ్రామాలు గుర్తుకొస్తున్నాయన్నారు. కార్పొరేటర్ సాన శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, రంగప్ప, సుధాకర్‌రెడ్డి, భవాని, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



క్రీడా దుస్తులు పంపిణీ చేసిన హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్

కర్నూలు (టౌన్): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించనున్న 14వ సబ్ జూనియర్ బాలుర అంతర్ జిల్లా హాకీ పోటీల్లో రాణించాలని హాకీ కర్నూలు సంఘం జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ సూచించారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రాష్ట్ర పోటీల్లో పాల్గొనే జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి విజేతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన హాకీ జట్టును ప్రకటించారు. జట్టులో అభినయ్, చరణ్, నాగరాజు రావు, హరిచరణ్, ప్రకాష్, కాశీ విశ్వనాథ్, తన్వీర్, దినకర్, అఖిల్, మనోహర్‌బాబు, తాహెర్‌బాషా, గురుచరణ్, సాయి ప్రశాంత్, నీరజ్, శివ, అజయ్ పాల్గొన్నారు.

## బాలసాయి సేవలు చిరస్మరణీయం





దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందిస్తున్న అతిథులు



పాల్గొన్న బాలసాయి భక్తులు

కర్నూలు కల్చరల్: భగవాన్ బాల సాయిబాబా సేవలు చిరస్మరణీయమని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. బాలసాయి జయంతి, ప్రపంచ శాంతి సదస్సు, దీనజన సేవా కార్యక్రమాలు మంగళవారం ఓల్డ్ సిటీలోని బాబా మందిరంలో ఘనంగా జరిగాయి. ఎంపీతో పాటు, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి తదితరులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. బాల సాయి సెంట్రల్ ట్రస్ట్ సేవలను కొనసాగించాలన్నారు. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. బాల సాయి చేపట్టిన సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. అంతముందు ప్రార్థనా మందిరంలోని బాలసాయి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ట్రస్టీ రామారావు మాట్లాడుతూ.. భగవాన్ బాలసాయి ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. పలువురికి కుట్టుమిషన్లు, పండ్లు, పూలు, కూరగాయల బండ్లు, గ్రైండర్లు, టీ స్టాల్ బండ్లు పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి అలరించాయి. ట్రస్టీ ఉషాశ్రీ, మాజీ ఎమ్మెల్యే మదనగోపాల్, జయప్రకాష్, ఇందిరా, విదేశీ భక్తులు పాల్గొన్నారు.

## దళిత నేత బాలసుందరం ఆకస్మిక మృతి



బాలసుందరం అంతిమయాత్రలో పాల్గొన్న నేతలు

కర్నూలు(అర్బన్): దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, దళిత, ప్రజా ఉద్యమ నేత మాధవరం బాలసుందరం గుండెపోటుతో మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. జిల్లాలో జరిగిన అనేక దళిత, ప్రజా ఉద్యమాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించారు. ఆయన మృతి విషయం తెలుసుకుని జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో దళిత, ప్రజా సంఘాల నేతలు ఆయన స్వగృహం చేరుకొని బాలసుందరం పార్థివ దేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించి, ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ లాయర్స్ ఫోరం అధ్యక్షుడు వై.జయరాజు, ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హృదయరాజు, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసారపు వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, తదితరులు నివాళులర్పించారు.


## రిజర్వాయర్‌ను నింపి సాగునీరు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు గౌస్‌దేశాయ్

కల్లూరు: చెన్నరాయుని తిప్ప రిజర్వాయర్‌కు నీళ్లు నింపి, పంట కాలువలు ఏర్పాటు చేసి రైతులకు సాగు నీటిని అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ నుంచి చెరువులకు నీటిని నింపాలన్నారు. ప్రజా అనుకూలంగా ప్రభుత్వాలు నడవకపోతే ప్రజలే వాటిని మార్చాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చడం లేదని మండిపడ్డారు. రైతులకు అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు, మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని విమర్శించారు. కుటుంబంలో చదువుకుంటున్న పిల్లలందరికీ తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇది ప్రజలను మోసం చేయడమే అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి వ్యవసాయ రంగానికి ఎలాంటి సహకారం అందడం లేదని, ఎన్నికల ముందు ఒక మాట, తర్వాత మరొక మాట మాట్లాడుతున్నారన్నారు. మండల కార్యదర్శి కృష్ణ, నాయకులు మహేష్, సుదర్శనం, శేఖరు, రిటైర్డ్ డిటీ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## హంద్రీని రక్షించుకుందాం




మాట్లాడుతున్న హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి

కల్లూరు: హంద్రీ నదిని రక్షించుకుందామని హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కల్లూరులోని ఆదిత్య స్కూల్‌లో కల్లూరు పరిరక్షణ సమితి అధ్యక్షుడు చంద్రశేఖరప్ప ఆధ్వర్యంలో హంద్రీ నది పరిరక్షణ ఆవశ్యకతపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పలువురు వక్తలు హాజరై హంద్రీ నది పరిరక్షణపై చర్చించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. హంద్రీ నది వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించడంతోపాటు అనేక గ్రామాలకు తాగు నీరు అందిస్తోందన్నారు. నదిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విశ్వనాథ్ మాట్లాడుతూ.. హంద్రీ నదిలో కంప చెట్లు అడ్డదిడ్డంగా పెరిగాయని మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని వాటిని తొలగించాలన్నారు. మిగతా వక్తలు మాట్లాడుతూ.. హంద్రీ నది పరిరక్షణపై కరపత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ర్యాలీలు చేపట్టి అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలను ఇస్తూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, ఫిరోజ్, శేషసాయి, మల్లయ్య, దేవదానం, తారకేశ్వర్‌రెడ్డి, రాజు, రవి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

కల్లూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు ఉత్సహంగా పాల్గొన్నారు. రంగవల్లులతో వివిధ రకాలుగా ఆకట్టుకునే ముగ్గులు వేశారు. పోటీలలో విజేతలైన వారికి ముగ్గుల పోటీల నిర్వాహకులు బహుమతులు ప్రధానం చేశారు.



ఉలిందకొండలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

## వాతావరణ కేంద్రం పనితీరుపై అవగాహన



వాతావరణ కేంద్రం ప్రాధాన్యతను వివరిస్తున్న అధికారులు

కర్నూలు (అగ్రికల్చర్): వాతావరణంలో చోటు చేసుకునే మార్పులపై ఎప్పటికప్పుడు విద్యార్థులు, ఇతర అన్ని వర్గాల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రాయలసీమ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డి.పుణ్యశేషుడు సూచించారు. భారత వాతావరణ విభాగం ఏర్పడి బుధవారం నాటికి సరిగ్గా 150 సంవత్సరాలు (1875–2025) పూర్తయిన సందర్భంగా దేశంలోని అన్ని వాతావరణ కేంద్రాల్లో వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. కర్నూలు జిల్లా వాతావరణ కేంద్రంలో నిర్వహించిన ఈ వేడుకలకు రాయలసీమ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు ముఖ్య అతిథిగా హాజరై వాతావరణ విభాగం ప్రాధాన్యతను వివరించారు. వాతావరణంలో తరచూ చోటు చేసుకునే మార్పుల గురించి రైతులు, విద్యార్థులు ఇతర అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజలు కూడా 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కర్నూలులోని బిర్లాగేట్ సమీపంలో ఉన్న వాతావరణ కేంద్రాన్ని పరిశీలించి అక్కడున్న వివిధ పరికరాల ప్రాధాన్యతను, అవి పనిచేసే విధానాన్ని తెలుసుకున్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వాతావరణ కేంద్రం అధికారులు పి.ప్రభాకర్, నాగలింగమయ్య, అవినాష్ బాబు, రాహుల్, నళిని మోహన్‌రావు, శ్రీనివాసులు, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే సమాజాభివృద్ధి



విజేతలకు బహుమతులను అందిస్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్

కర్నూలు(సెంట్రల్): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని డీఈఓ శామ్యూల్‌పాల్ అన్నారు. బుధవారం జొహరాపురంలోని భవిత ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, సీఐటీయూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలను నిర్వహించారు. అలాగే కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రధాన కార్యక్రమం జరిగింది. ఆయా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి డీఈఓ శామ్యూల్‌పాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల చదువు సమాజానికి వెలుగు అన్నారు. మహిళలు చదువుకుంటే ఆ ఇంటితోపాటు సమీపంలో ఉన్న వారంతా చదువుకున్నట్లేనన్నారు. అలాగే ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో అవసరమని, ప్రతి విద్యార్థి కరాటేలో శిక్షణ పొందాలన్నారు. అనంతరం వన్‌టౌన్ సీఐ రామానాయుడుతో కలసి డీఈఓ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సుందరయ్య స్ఫూర్తి విజ్ఞాన కేంద్రం జిల్లా కన్వీనర్ డి.గౌస్ దేశాయ్, అమర్‌బాబు, కె.సురేష్‌కుమార్, రంగప్ప, రాజశేఖర్, విజయ్, కరెస్పాండెంట్ నరేంద్ర పాల్గొన్నారు.

## కార్డియాలజిస్టు రామకృష్ణారెడ్డి మృతి



డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి (84) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన వయస్సురీత్యా కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన మంగళవారం డాక్టర్స్ కాలనీలోని నివాసంలో కన్నుమూశారు. నంద్యాల జిల్లా సంజామలకు చెందిన టి.రామకృష్ణారెడ్డి పాఠశాల విద్యాభ్యాసాన్ని అక్కడే చదివారు. అనంతరం కర్నూలు మెడికల్ కాలేజీలో మూడవ బ్యాచ్ విద్యార్థిగా చేరి ఎంబీబీఎస్, ఎండీ జనరల్ మెడిసిన్ పూర్తి చేశారు. తర్వాత బాంబేలో ఎండీ కార్డియాలజీ అభ్యసించారు. అప్పట్లో రాయలసీమలో మొదటి కార్డియాలజిస్టు ఆయనే కావడం విశేషం. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజీ విభాగాధిపతిగా 22 ఏళ్లపాటు సేవలందించారు. అనంతరం కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేసి 2001లో పదవీ విరమణ చెందారు. ఆయన మరణం పట్ల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామచంద్రనాయుడు, డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, సభ్యులు, ప్రముఖ వైద్యులు సంతాపం ప్రకటించారు.

## తెలంగాణ మద్యం పట్టివేత



తెలంగాణ మద్యంను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు (టౌన్): అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యాన్ని ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. స్థానిక కల్లూరు ఎస్టేట్‌లోని వెంకట చలపతి నగర్‌కు చెందిన బోయ రమణమ్మ అనే మహిళ వద్ద తెలంగాణ మద్యం ఉన్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. అమె వద్ద 11 ఫుల్ బాటిళ్లు 13 క్వార్టర్ల మాన్షన్ హౌస్ బ్రాందీ బాటిళ్లు దొరికాయి. నిందితురాలిపై కేసు నమోదు చేశారు. అలాగే కర్నూలు నగరంలోని బంగారుపేటలోని నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. నీలిషికారి శాంతమ్మ అనే మహిళ వద్ద 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ వెల్లడించారు. దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ రెహెనా బేగం, నవీన్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.